# స్వయం శాపం

*- స్పందనవాణి, 1976*

---

"కాలం అందించే విషాదాల్నుండి ఎలాగూ తప్పించుకోలేం. ఇంకా స్వయంగా శాపాల్ని ఎందుకు కొనితెచ్చుకోవడం?"

---

అద్భుతమూ, అతి సుందరమూ అయిన ప్రకృతిలో మైమరచిపోతూ తిరుమల శిఖరాన ఓ కొండ పాదాన మానసంపెంగ చెట్టు క్రింద ఒంటరిగా కూర్చొనున్నాను.

నా భుజంమీద చల్లటి చెయ్యి. ఉలిక్కిపడి వెనక్కి తిరిగాను. నా ఎదురుగా నా చిన్ననాటి నేస్తం హరిప్రియ.

"హరీ! నువ్వా! ఇక్కడ!" ఆమె నవ్వింది.

ఆశ్చర్యపోవాల్సింది నేను అసలు "ఆస్ట్రేలియానుండి ఎప్పుడొచ్చావ్? ఉత్తరమయినా వ్రాయలేదేం?"

"వ్రాద్దామనే అనుకున్నాను కానీ ఏవిటో ప్రైవేట్ ప్రాక్టీసలో పడీ....."

"ప్రాక్టీస పెట్టావా? ఎక్కడ? కనిగిరిలోనేనా. ఏమిటి ఆస్ట్రేలియా బోర్ కొట్టిందా?"

"ఆఁ ఎప్పుడూ బోరే.... డ్రైలైఫ్... ఈనాటికి శ్రీవారు విముక్తినిచ్చారు.... మీ పిల్లలేరి?"

"కాటేజీలో వున్నారు పోదాం పద."

నారాయణగిరి స్పెషల్ క్వార్టర్స్ మొదటి మెట్టుమీద ఓ అందమైన నేత్రద్వయం నన్నాపేసింది. "అమ్మవాళ్ళు లేరత్తా... గుడికెళ్ళారు." నన్ను ఆ అమ్మాయికి పరిచయం చేసింది హరి. ఆమె హరి అన్నకూతురు. పేరు స్వప్న.

"రూమ్‌లో ఎవ్వరూ లేరంటగా ఇక రూమ్‌కెందుకు హరీ.... వాళ్ళు వచ్చేదాక అదో.... ఆ లాన్‌లో కూర్చుందాం రా.... నువ్వూ రా పాపా!"

స్వప్న ప్రక్కనున్న క్రచెస్ తీసుకుంది. విస్తుబోయి ఆమె కాళ్ళవైపు చూసాను. ఆమె అది గమనించినట్లుంది. కళ్ళెత్తి నా వైపు చూసింది.

ఎంతకాలమైనా అలా చూస్తూ గడపవచ్చని నేననుకున్న ఆ నక్షత్రాల్లాంటి కళ్ళు దీనంగా చూసాయి. నేను హరివైపు చూసాను.

హరి నా కళ్ళల్లో ప్రశ్నని అర్థం చేసుకున్నట్టుంది.

"స్వప్నకు పోలియో" చెప్పింది.

నేను మౌనంగా కదిలాను. నా వెనుక హేండ్‌స్టిక్ చేసే హృదయ విదారకమైన శబ్దం.... ఎంత దారుణమైన వ్యాధి.... ఎంత దయనీయమైన సంగతి!

పసుపుపచ్చ రోజాచెట్టు ప్రక్కన కూర్చుంటూ అడిగాను "ఒరల్ పోలియో వేక్సిన్ ఫెయిల్ అయిందా?"

"ఉహూ అసలు ఇమ్యునైజేషన్ చేయించలేదు."

"చేయించలేదూ? ఎందుకని?"

హరిప్రియ మాట్లాడలేదు.

"అంటీ!" ఆ అమ్మాయి పెదాలు కదిలాయి.

"మా ఇంటికి వేక్సినేషన్ అచ్చి రాదంట అంటీ" ఆ అమ్మాయి గొంతులో కొంత వ్యంగ్యం కొంత వేదన.

నేను హరిప్రియ వైపు చూసాను.

"ఏమిటో శ్వేతా! మానాన్నమ్మది చాదస్తం - కొన్ని, కొన్ని ఇళ్ళకు అచ్చి రాదంటుంది. ఆమెకు తెలీనీకుండా మా పిల్లలకు వేయిస్తూ వుంటాం."

"అంటే.... అంటే స్వప్నని చూసి కూడా ఆమె మారలేదా?"

"ఉహూఁ వాళ్ళు మారరు అంటీ మా జీవితాలు మాత్రం ఇదో ఇలా మారిపోతూ వుంటాయి... అదేమంటే మాకాలంలో ఇవన్నీ వున్నాయా?" అంటారు.

టీనేజ్‌లో ఎంటర్ అయిన ఆ పసిపిల్లకు తన జీవితంపట్ల ఎంత అసంతృప్తో! అలా తన జీవితాన్ని కాటేసినా నాన్నమ్మ మీద ఎంత కక్షో!

"శ్వేతా! మా అమ్మ మొదటి సంతానం మా అన్న... ఇప్పుడు లేడులే... ఆయన స్మాల్ పాక్స్ వేక్సినేషన్ వేయిస్తే చనిపోయాడట. అప్పటినుండీ....."

"ఏం అత్తా! చచ్చిపోతే ఏం? ఒక్కసారి చస్తాం. ఇలా ఇలా ఈడ్చుకుంటూ రోజు రోజూ చావంగా."

ఆ పిల్లను ఓదార్చాలనుంది కానీ ఎలా? ఏ భాషతో? పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని వచ్చి ఈ మారు మూల గ్రామంలో ప్రాక్టీసు పెట్టిన నాకు ఈ కొద్ది రోజుల్లో పేషంట్లు అయితే వస్తున్నారు కానీ వాళ్ళ మనస్తత్వమే చిత్రంగా వుంది. వేక్సినేషన్ వేయించుకోమంటే 'వచ్చే జబ్బులు కర్మకొద్దీ వస్తాయి. మనం ఏంచేస్తే మాత్రం ఆగుతాయా?' అనే వాళ్ళు కొందరయితే, "ఏదో తాత్సారమైపోయింది. దీని రాత ఇలా కాలింది' అనే వాళ్ళు కొందరు.

ఇమ్యునైజేషన్ అనేది జీవితంలో అతి ముఖ్యమైనది. అన్నం తినడానికి తాత్సారం చేస్తున్నామా? బట్టలు కొనుక్కోను తాత్సారం చేస్తున్నామా? ఎవరో పెళ్ళికి హాజరు వేయడానికి మర్చిపోతున్నామా? మన జీవితంలో ఇంత అవసరమైన జబ్బు నిరోధక వేక్సినేషన్ వేయించుకోవడాన్ని ఎందుకు అలక్ష్యం చేస్తున్నాము?

"ఏమిటోయ్ ఆలోచిస్తున్నావు?" కుదిపింది హరిప్రియ.

"ఏమీ లేదు హరీ! ఇంకా వీళ్ళలో ఎంత అజ్ఞానం మిగిలుందో చూడు. టి.బి. జబ్బు రాకుండా బి.సి.జి. వేక్సినేషన్ వేయించుకోమంటే 'పిల్లది చిడిపెడ్తది వద్దులెండి' అంటారు."

"పోలియో వాక్సిన్ వేయించుకోమంటే జ్వరం వస్తుందంటారు. గర్భిణీ స్త్రీని పరీక్షచేసి 'బిడ్డకు టెటనస్ రాకుండా ఇంజక్షన్ వేయించుకోమ్మా' అంటే డబ్బు ఖర్చంటారు."

చిన్నగా నవ్వింది హరిప్రియ.

"నవ్వకు..... ఈ మధ్య డిఫ్తీరియా జబ్బుతో ఓ బిడ్డను తీసుకొచ్చారు. పిల్లల డాక్టరుకు రెఫర్ చేస్తూ ట్రిపుల్ యాంటీజన్ వేయించలేదా?" అని అడిగాను.

"ఏమంది? నొప్పని వద్దందా?"

"అచ్చు అలాగే అంది కానీ హరీ! మరి ఇప్పుడు ఈ గొంతునొప్పికాదా! ఈ పసిబిడ్డ గొంతు బాధతో విలవిలలాడి దురదృష్టవశాత్తు చనిపోతే.... తల్లి మానసిక

బాధ నొప్పికాదా?.... అదెందుకు అర్థం కాదు వీళ్ళకు?.... అదేమంటే 'మారోజుల్లో వున్నాయా' అంటారు. ఆ రోజుల్లో నైలాన్ చీరలు లేవు మరి ఇప్పుడు కట్టడంలా? ఆ రోజుల్లో టి.వి.లు లేవు. ఈ రోజు చూడడంలేదా?"

ఆలోచిస్తూ లేచి నిల్చుంది హరిప్రియ.

"లేదులే శ్వేతా! కాలం మారింది ఇప్పుడు అందరు తల్లులు జాగ్రత్త పడ్తున్నారు. మా డాక్టరుగారు కూడా అదే అంటారు. చిన్న అమ్మవారు జబ్బులాటిది రాకుండా కూడా మీజల్స్ వేక్సిన్ వేయమని అడుగుతున్నారు అని."

"నేనీరోజుల్లో పుట్టుంటే ఎంత బాగుండేదత్తా!" ఆశగా అంటున్న ఆ పసిపిల్లను చూసాను.

పెద్దవాళ్ళ ఓ చిన్న తప్పుకు ఈ పిల్లకు ఎంత పెద్ద శిక్ష పడింది!

"జబ్బు చేసాక ఎక్కడ చూపించారు?" హరిప్రియవైపు తిరుగుతూ అడిగాను.

"చూపించని చోటు లేదు." నిట్టూర్చింది హరి.

"ఇక జీవితాంతం ఇంతేనా ఆంటీ నేను?"

ఆ అమ్మాయి ఓ దీర్ఘశ్వాస వదిలి అడిగిన ప్రశ్నకు జవాబు కష్టం. పోలియో జబ్బుకు ట్రీట్‌మెంట్ అంతంత మాత్రంగా వున్న రోజులివి. కానీ నేను ఆ జవాబివ్వలేదు.

"లేదులేమ్మా.... సైన్స్ అభివృద్ధి చెందుతోంది. తప్పకుండా పోలియో వ్యాధి నయం అయ్యే రోజులొస్తాయి."

"ఎప్పుడు? ఎప్పుడాంటీ నేను చచ్చిపోయాకా?"

మామీదుగా ఓ మబ్బుతెర ప్రయాణం చేసింది. ఓ నీటిచుక్కరాల్చి వెళ్ళింది. స్వప్న కళ్ళు వర్షించాయి.